# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

సోమవారం 17-7-2023




## ‘వందే భారత్’లో అగ్నిప్రమాదం

**తెలుగుప్రభ,హైదరాబాద్(జూలై17):**

భోపాల్– ఢిల్లీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులోని ఒక కోచ్‌లో బ్యాటరీ బాక్స్‌లో మంటలు చెలరేగాయి.రాణి కమలాపతి–హజ్రత్ నిజాముద్దీన్ వందేభారత్ రైలు సోమవారం తెల్లవారుజామున 5.40 గంటలకు భోపాల్ నుంచి బయల్దేరింది. 6.45 గంటల ప్రాంతంలో సీ–12 కోచ్ చక్రాల్లో పొగలు రావడాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది రైలును వెంటనే విదిశ జిల్లాలోని కేతోరా స్టేషన్‌దగ్గర ఆపి పరిశీలించారు. బ్యాటరీ బాక్స్‌లో మంటలు చెలరేగినట్లు గుర్తించి ప్రయాణికులను దింపేశారు.సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పివేశారు. ప్రమాదం వల్ల ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.

## మహారాష్ట్ర నుంచి కేసీఆర్ పోటీ?

- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో..
- అబ్‌కీ బార్.. కిసాన్ సర్కార్.. లక్ష్యం

**బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖరరావు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి పోటీ చేయనున్నారా? అంటే అవుననే వినిపిస్తోంది. కేంద్ర రాజకీయాల్లో సైతం చక్రం తిప్పడమే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.**



**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై17):**

బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖరరావు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి పోటీ చేయనున్నారా? అంటే అవుననే వినిపిస్తోంది. జాతీయ రాజకీయాలపై దృష్టితోనే టీఆర్ఎస్ అంటే రాష్ట్రానికే పరిమితమవుతుందనే తలంపుతో పార్టీపేరును సైతం భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)గా మార్చడం తెలిసిందే. ఇప్పటికే పలు పర్యాయాలు మహారాష్ట్రలోని వివిధ నగరాల్లో బహిరంగ సభల ఏర్పాటుతో పాటు పలువురు నేతల్ని సైతం బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం తెలిసిందే. ‘అబ్‌కీ బార్.. కిసాన్ సర్కార్’ నినాదంతో ప్రచారం నిర్వహిస్తున్న కేసీఆర్ ప్రధాని మోదీని గద్దెదింపి జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలనే ప్లాన్లో ఉన్నారు. అందులో భాగంగానే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కొన్ని రాష్ట్రాల నుంచి పోటీ చేయనుంది. కేసీఆర్ తెలంగాణలో ఇది వరకు గెలిచిన మెదక్ స్థానంతో పాటు తెలంగాణ సరిహద్దులకు దగ్గరగా ఉన్న మహారాష్ట్రలోని ఒక లోక్‌సభ స్థానం నుంచి కూడా పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు, ఢిల్లీకి చెందిన సిసెరో అనే ఎన్నికల సర్వే సంస్థతో కూడా కేసీఆర్ సర్వే జరిపించినట్లు తెలిసింది. గతనెలలో సర్వే జరిపిన సదరుసంస్థ బీఆర్ఎస్ పోటీచేసేందుకు అనుకూలంగా ఉన్న నియోజకవర్గాల వివరాలు అందించినట్లు సమాచారం. సర్వే ఏజెన్సీ ఏపీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకల్లో తమ బందాల ద్వారా సర్వే జరిపినట్లు సమాచారం. కొందరు సినీ ప్రముఖులను కూడా బీఆర్ఎస్ నుంచి ఎన్నికల బరిలో దింపే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. అందులో భాగంగానే ఇటీవల కేసీఆర్‌ను కలిసిన తమిళస్టార్ విజయ్‌తో పార్టీ నేతలు చర్చలు జరుపుతున్నట్లు కూడా తెలుస్తోంది. పార్టీని జాతీయస్థాయికి విస్తరించే క్రమంలో భాగంగానే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలను పార్టీలో చేర్చుకోవడం తెలిసిందే.

## ఓఆర్ఆర్ వద్ద రోడ్డు ప్రమాదం ముగ్గురి మృతి

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై17):**

మేడ్చల్ జిల్లాలో శామీర్‌పేట కీసర ఔటర్ రింగ్‌రోడ్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అతివేగంతో వస్తున్న లారా, బొలేరో, కారు ఒకదాన్నొకటి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వాహనాల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, మేడ్చల్ నుంచి కీసర వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి డివైడర్ పైఉంచి ఎగిరి పడి ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొన్నది. వేగంగా వచ్చిన మరోకారు కూడా మూడు వాహనాలు ఢీకొన్నాయి.





## పరిశ్రమలో పేలుడు..

### 14 మందికి తీవ్రగాయాలు

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై17):**

నగర శివార్లలోని రంగారెడ్డి జిల్లా బూర్గుల గ్రామంలోని శ్రీనాథ్ రోటోప్యాక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన పెయింట్ పరిశ్రమలో జరిగిన భారీ పేలుడులో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో 11 మంది పరిస్థితి 50 శాతానికి పైగా కాలిన గాయాలతో విషమంగా ఉన్నట్లు తెలిసింది. చికిత్స నిమిత్తం వారిని నగరంలోని ఉస్మానియా,గాంధీ ఆస్పత్రులకు తరలించారు. రంగుల తయారీ యంత్రం ఒక్కసారిగా పేలడంతో తీవ్ర మంటలు చెలరేగి అందులో పని చేస్తున్న కార్మికులకు శరీరాలు కాలిపోయాయి. సంఘటన సమయంలో పరిశ్రమలో దాదాపు 50 మంది కార్మికులున్నట్లు సమాచారం. గాయపడ్డవారిని తొలుత షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం గాయాల తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని హైదరాబాద్‌కు పంపించినట్లు డాక్టర్లు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకసిబ్బంది వెంటనే అక్కడకు చేరుకొని మంటల్ని అదుపులోకి తెచ్చారు. బాధితులంతా ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు. క్షతగాత్రుల్లో మంజుదాస్, పరదేపన్,శరత్, గిరిధర్‌సింగ్, పురాన్‌సిగ్, రాహుల్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేలే కానీ..

**దేశ వ్యాప్తంగా 1136 మందిపై క్రిమినల్ కేసులు — అత్యధికంగా కేరళలో 95 మందిపై..**

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై17):**

దేశంలో అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా పేరెన్నికగన్న కేరళ రాష్ట్రంలో క్రిమినల్ కేసులున్న ఎమ్మెల్యేలు కూడా ఎక్కువే ఉన్నారు. దేశ వ్యాప్తంగా పరిగణనలోకి తీసుకుంటే 44 శాతం మంది ఎమ్మెల్యేలపై కేసులుండగా, రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో 70 శాతం మంది ఎమ్మెల్యేలపై కేసులున్నాయి. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) అనే సంస్థ నేషనల్ ఎలక్షన్ వాచ్(ఎన్ఈడబ్ల్యు)తో కలిసి చేసిన విశ్లేషణలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. 28 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని అసెంబ్లీల్లో ఎన్నికల సందర్భంగా దాఖలు చేసిన వారి అఫిడవిట్‌లలోని వివరాల ఆధారంగా చేసిన విశ్లేషణలో ఈ వివరాలు తెలిశాయి.

### తీవ్రమైన నేరాల కేసులు

మొత్తం 4001 ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్‌లను విశ్లేషించగా, వారిలో 1136 మందిపై తీవ్రమైన నేరాల కేసులున్నట్లు తేలింది. అంటే దేశవ్యాప్తంగా ఇలాంటి వారు 28 శాతం మంది ఉన్నారు. వీరిపై హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై దాడులు వంటి కేసులున్నాయి. మహిళలపై దాడులకు సంబంధించి 114 మందిపై కేసులుండగా, వీరిలో 14 మందిపై రేప్ కేసులుండటం ఆందోళన కలిగిస్తోంది.

### కేరళ టాప్

మొత్తం ఎమ్మెల్యేల్లో అత్యధికంగా కేరళ రాష్ట్రంలో 95 మందిపై కేసులున్నాయి. అక్కడ 135మంది ఎమ్మెల్యేలో 95 మందిపై అంటే 70 శాతం మందిపై కేసులున్నాయి.

### తీవ్రమైన నేరాల్లో ఢిల్లీ టాప్

ఇక తీవ్రమైన క్రిమినల్ కేసులున్న ఎమ్మెల్యేలు ఎక్కువమంది ఉన్న రాష్ట్రాల్లో ఢిల్లీ టాప్‌లో ఉంది. అక్కడ 53శాతంమందిపై అలాంటి కేసులున్నాయి. బీహార్‌లో 50 శాతం, మహారాష్ట్రలో 40 శాతం, జార్ఖండ్‌లో 39 శాతం,తెలంగాణలో 39 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 38 శాతం మంది ఎమ్మెల్యేలపై ఈ తరహా కేసులున్నాయి.

**ఏ రాష్ట్రంలో ఎంత శాతం మందిపై కేసులున్నాయో వివరాలిలా ఉన్నాయి.**

| రాష్ట్రం | ఎమ్మెల్యేలు | కేసులున్న వారు | శాతం |
|---|---|---|---|
| కేరళ | 135 | 95 | 70 |
| బీహార్ | 242 | 161 | 67 |
| ఢిల్లీ | 70 | 44 | 63 |
| మహారాష్ట్ర | 284 | 175 | 62 |
| తమిళనాడు | 224 | 134 | 60 |





## బొమ్మలు కాదు.. నిజంగా పుర్రెలే

**తెలుగుప్రభ,హైదరాబాద్(జూలై17):**

ఎవరి పిచ్చి వారి కానందం అన్నట్లు డెకరేషన్ కోసం ఎవరో ఈ పుర్రెల బొమ్మలు పెట్టుకున్నట్లుంది అనుకుంటున్నారా ? మీరు పొరబడ్డట్లే. బొమ్మలు కావవి నిజంగా పుర్రెలే. అమెరికాలోని వాషింగ్టన్‌లో ఉంటున్న జేమ్స్‌నాట్ అనే వ్యక్తి ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 40 మంది మనుషుల పుర్రెలతో పాటు ఎముకలు, ఇతరత్రా అవశేషాలతో తన గదిని అలంకరించుకున్నాడు. ఇటీవల హార్వర్డ్ మెడికల్ స్కూల్ నుంచి కొన్ని అవయవాలు మాయం కావడంతో ఆయా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన అధికారులు జేమ్స్ నాట్ ఇంట్లో వీటిని కనుగొన్నారు. తన ఇంట్లోని మంచం, కుర్చీలు, ఇతరత్రా వస్తువులను ఎముకలతో అలంకరించడాన్ని చూసి నోరెళ్లబెట్టారు. అతడో సైకోగా భావిస్తున్నారు.



## ‘రక్షక’భటుడు

- ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని ఆదుకుంటున్న కానిస్టేబుల్
- రక్తదాన శిబిరాల ద్వారా ప్రజా సేవ

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై17):**

అతనో కానిస్టేబుల్. రక్తదాన శిబిరాల ద్వారా ప్రాణాపాయంలోని ఎందరికో రక్తమిప్పించారు. ఇప్పటి వరకు రక్తదాన శిబిరాల ద్వారా 15,976 మందికి రక్తం అందించారు. కోవిడ్ సమయంలో 5565 యూనిట్ల రక్తం సేకరించి ఆపదలో ఉన్న పేషెంట్లకు అందజేశారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని మట్టేవాడ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కన్నరాజుకు విధి నిర్వహణలో భాగంగా శాంతి భద్రతలు కాపాడటంతో పాటు ఆపదలోని వారికి ప్రాణం పోయడమంటే ప్రాణం. అందుకే ఒకటి కాదు రెండుకాదు ఇప్పటి వరకు

44 రక్తదాన శిబిరాలు నిర్వహించారు. తాను స్వయంగా 31 పర్యాయాలు రక్తదానం చేశారు. ఇంటర్మీడియెట్ చదువుతున్నప్పుడు ఎన్ఎస్ఎస్ ద్వారా తొలిసారి రక్తదానం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రక్తదానంపై పలువురికి అవగాహన కల్పిస్తూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ప్రది పదిహేను రోజులకోమారు రక్తమవసరమయ్యే తలసేమియా బాధిత చిన్నారుల పరిస్థితి చూసి చలించి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. దాదాపు పదివేలమందితోవాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి రక్తం కావాలని ఫోన్ చేసిన వారికి రక్తమిస్తున్నారు.మిత్రులతో కలిసి యువనేతాజీ ఫౌండేషన్ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఐదు రాష్ట్రాల్లోఅవగాహన సదస్సులు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



## విడుదలకు ముందే ‘రజాకార్’పై వివాదం

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై17):**

తెలంగాణ బీజేపీ నాయకులు రూపొందిస్తున్న ‘రజాకార్’ సినిమాకు సంబంధించిన పోస్టర్‌పై వివాదం నెలకొంది.ఓ వర్గం ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. 1948 నాటి ఘటనల ఆధారంగా అని పేర్కొంటూ, తప్పుగా చిత్రీకరించి రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని చెబుతున్నారు. ఇప్పటికే వచ్చిన ది కాశ్మీర్ ఫైల్స్,కేరళస్టోరీ సినిమాల తరహాలోనే తెలంగాణలోని రజాకార్ల దురాగతాలకు సంబంధించి తీసిన ఈ సినిమాలోనూ ఒక వర్గాన్ని తక్కువ చేసి చూపిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

